''నా నోరు ఎలా పండింంది చెప్పవా?'' అంటూ అందరూ చుట్టూ మూగారు.

అందరి నోళ్లు చూసాక తన్మయి నాలికే ఎక్కువ ఎర్రగా పండిందని తేల్చి చెప్పింది అందరికీ లీడర్‌లాంటి పద్మ.

ఆశ్వీజ బహుళ తదియ. ఇంకా తెల్లవారలేదు. ఆడపిల్లలందరూ సూర్యోదయానికి చాలా ముందుగానే లేచి తలంట్లు పోసుకుని, ఉట్టికింద ముద్దలు తిని, తాంబూలాలు వేసుకుని మహా ఉత్సాహంగా వున్నారు.

''అంత ఎర్రగా పండితే పండులాంటి మొగుడొస్తాడని అంటారు'' అని ''కదే?'' అని కలిపింది కళ్యాణి.

తన్మయికి సిగ్గు ముంచుకొచ్చింది. బుగ్గలు రెండూ వేడెక్కినట్లు అన్పించింది. తన్మయినే చూస్తూన్న లహరి అంది-

''ఏయ్ తన్మయి! నీ నోరేకాదే, నీ బుగ్గలు కూడా పండాయే'' అని. పచ్చగా వుండే తన్మయి చెంపలు సిగ్గుతో ఎర్రగా కందిపోయాయి.

★★★

పెళ్లిచూపులనాడు-

''అబ్బాయెంత బాగున్నాడే?''

''చాల్చాల్లెద్దూ.. ఎంత బావున్నా మన తన్మయి ముందు ఓ ఛాయ తక్కువే''

''ఛాయ తక్కువేలే. నేనంటున్నది కుర్రాడి అందం గురించి''

''అందమా? బాగున్నాడు అను ఒప్పుకుంటాను. మన పిల్లకన్నా మాత్రం కాదు''

ఇలా నడిచింది సంభాషణ. ఈడూ జోడూ అన్నారు. అందం చందం అన్నారు. అబ్బాయి అమెరికా వెళ్లిపోవాలి అని తొందరపెడితే వున్నవాటిలో ఓ మంచి ముహూర్తం చూసి పెళ్లి జరిపించారు.

మూడురోజులూ మూడురోజులుగాకాక మూడు రాత్రులుగానే గడిచాయి. నాలుగోరోజు రవీంద్ర అమెరికా బయలుదేరాడు.

''ఇగో తన్మూ బేబీ, నేను వెళ్తూనే నీకు వీసా పంపే ఏర్పాట్లు చేస్తాను. ఎంత డబ్బయినా ఫర్వాలేదు. పాస్‌పోర్టు వెంటనే సంపాదించమను మీ వాళ్లని'' గదిలో తన్మయిని

# మాతృసమయం

## నడిమింటి జగ్గారావు

ముద్దు పెట్టుకుంటూ అన్నాడు రవీంద్ర.

''పోనీ మరి కొన్నాళ్లు సెలవు పొడిగించకూడదూ?'' అన్న తన్మయితో-

''అదేమన్నా మన ఇండియా అనుకున్నావా? ఇంటినుంచే సెలవు చీటీ రాసి పంపించడానికి? అమెరికా'' గొప్పగా చెప్పాడు రవీంద్ర.

రవీంద్ర మాటలకు ఎందుకోగానీ కష్టపెట్టాయి తన్మయిని.

సరిగ్గా నాలుగు నెలల తరువాత అమెరికా బయలు దేరింది తన్మయి.

నాలుగునెలల్లోనూ నలభైసార్లు ఫోను చేసి వుంటాడు రవీంద్ర. ప్రతిసారీ వీసా గురించిన తన ప్రయత్నాలు ఫలించలేదని చెప్పవలసి వచ్చింది రవీంద్రకి.

''అది ఇండియా కాదు. అమెరికా కదా! వీసా రావడానికి ఎందుకింత ఆలస్యం. నా పాస్‌పోర్ట్ నెల్లాళ్లలో వచ్చింది మన ఇండియాలో'' కసిగా అనుకుంది తన్మయి. చివరికి వీసా వచ్చింది. తన్మయి బయలు దేరింది. బయలుదేరేరోజున ఇంటిల్లిపాదీ ఎయిర్‌పోర్టుకి వచ్చారు. కన్నీళ్లతో నవ్వుతూ వీడ్కోలు చెప్పారు.

★★★

ఫ్లోరిడా! ప్రపంచంలో అత్యంత ఖరీదైన నగరం. వచ్చిన కొద్దిరోజులకే తన్మయికి అర్థమయింది అక్కడి జీవితం.

''ఇక్కడి మనుషులకి దొరకనిది లేదు, ఒక్క సమయం తప్ప. వీళ్లకి రోజుకి ఇరవై నాలుగుకాదు, ముప్పై నాలుగు గంటలున్నా సరిపోదు'' అనుకుంది తన్మయి.

రవీంద్ర ఒక పని రాక్షసుడు. రోజుకి దాదాపు పన్నెండు గంటలు పని చేస్తాడు. ఒకసారి వంటరితనంతో చిరాకువేసి తన్మయి అంది.

''మీరు ఇండియాలోనే ఇంత పని చేస్తే మనం హాయిగా బ్రతగ్గలిగి వుండేవాళ్లం. అమెరికా రానే అక్కరలేదు కదండీ''

రవీంద్ర వెంటనే అసహనంగా అన్నాడు.

''అక్కడ నాలాంటివాళ్ల ప్రతిభకి గుర్తింపులేదు. రాదు''

తన్మయి మనసు చివుక్కుమంది.

ఆమె జీవితంలో మార్పంటూ ఏదన్నా వుంటే అది వారాంతంలో రవీంద్రతో కలిసి బయట తిరిగి రావడమే. సోమవారం తెల్లవారుతోందంటే తన్మయికి భయం. ఐదురోజులపాటు రవీంద్ర ఒక యంత్రమయిపోతాడు. రవీంద్ర ఆఫీసుకి వెళ్లిపోయాక తను ఫ్లాట్‌లో రోజంతా వంటరిగా గడుపుతుంది తన్మయి.

ఫ్లాట్స్‌లో చాలామంది నల్లవాళ్లు... వాళ్లంటే తన్మయికి భయం. వాళ్ల బలిష్టమయిన దేహాలు, మొరటు ముఖాలు, బండ పెదవులు, నవ్వినప్పుడు ఇగుళ్లు కనబడుతూ, తెల్లగా కోరల్లా మెరిసే వాళ్ల దంతాలూ. అయితే ప్రతి ఉదయం అందరూ 'గుడ్‌మార్నింగ్'లు చెబుతారు. పరిచయం కానక్కర్లేదు. ఒకరోజు మధ్యాహ్నం రవీంద్రలేని సమయంలో కాలింగ్ బెల్ మోగింది. తలుపుకి వున్న మ్యాజిక్-ఐ లోంచి చూసిం ది. నీగ్రో! తన్మయికి పై ప్రాణాలు పైనే పోయాయి.

''వ్వాట్?'' గొంతు కీచుగా, భయంగా వచ్చింది.

''హై! మా అమ్మ మీతో మాట్లాడాల నుకుం టోంది'' నీగ్రో యాసతో ఇంగ్లీషులో మాట్లాడు తున్నా డు. స్వరం మనిషంత భయంకరంగా లేదు. మర్యాదగానే

**కథల పోటీ మానవసంబంధాలు విభాగంలో కన్సొలేషన్ బహుమతి (రూ.1,250) కథ**

వుంది.

తలుపుకి వున్న గొలుసు సరిగా వుందో లేదో చూసుకుని తలుపు ఓరగా తెరిచింది తన్మయి.

అవసరమైనదానికన్నా ఎక్కువగా నవ్వుతూ, పళ్లన్నీ బయటపెట్టి ఇకిలిస్తూ ముందుకు వచ్చింది ఆ నల్లామె. అతను వచ్చిన పని అయిపోయినట్లు వెనుదిరిగి వెళ్లిపోయాడు.

'ఇదేవిటో! తనలాంటి వాళ్లని ముగ్గురిని ఒక్క బిగిన తినేయగలదు. మొహం ఏమిటీ అంత మొరటుగా వుంది? నల్లగా వున్నా చూడగలిగేలా వుండొచ్చుకదా! ఆ



గుండెలేమిటి అంత పెద్దవిగా వున్నాయి? ఆడదాన్ని నాకే సిగ్గేస్తోంది చూస్తుంటే' అనుకుంటూ తలుపు పూర్తిగా తీసి లోపలికి ఆహ్వానించింది తన్మయి.

తననే వింతగా చూస్తున్న తన్మయితో ''నా పేరు సిల్వియా. గాంబియా నుంచి వచ్చాను. ఇందాక నిన్ను పిలిచినవాడు నా పెద్ద కొడుకు. నీడితో కలిసి నాకు ఆరుగురు పిల్లలు. ఇద్దరు మగపిల్లలు, నలుగురు ఆడపిల్లలు. అందరికీ పెళ్లిళ్లయిపోయాయి. కొన్నాళ్లు నీడి దగ్గర గడుపుదామని వచ్చాను. ఒక్కర్తినీ వుండడం అలవాటులేదు. బోరుకొట్టి నీ దగ్గరికి వచ్చాను''

''నా పేరు తన్మయి. ఇండియా నుంచి వచ్చాను. మావారు ఇక్కడ కంప్యూటర్ ఇంజనీరుగా పని చేస్తున్నారు'' నెమ్మదిగా, ఇంగ్లీషులో చెప్పింది తన్మయి.


''ఏం పేరూ? టన్‌మయి! వెరీగుడ్! వెరీగుడ్!'' బాగా నవ్వుతూ అంది సిల్వియా.

''ఇదెక్కడ దాపురించిందిరా భగవంతుడా! హిడింబిలా మొహమూ ఇదీనూ! దీని వైఖరి చూస్తే ఇప్పుడిప్పుడే కదిలేలా లేదే'' అనుకుంటూనే-

''కాఫీ తాగుతారా? టీ తాగుతారా?'' అంది.

''టీ! టీ!!'' గట్టి గొంతుతో నవ్వుతూ చెప్పింది సిల్వియా. తర్వాత తీరుబాటుగా కబుర్లు మొదలుపెట్టింది. తన్మయి గురించి అడిగి తెలుసుకుంది.

''దీనికెందుకో నా వివరాలన్నీ?''




గంటసేపూ సిల్వియానే మాట్లాడింది. తన్మయి వింటూ తలూపుతూ కూర్చుంది. తర్వాత వెళ్లడానికి లేచింది సిల్వియా.

''మనం మళ్లీ కలుస్తూ వుందాం. ఇక్కడే వుంటాం కదా. బై'' తన తొంభై కిలోల బరువుని భారంగా మోసుకుంటూ వెళ్లిపోయింది.

''అమ్మయ్య! వెళ్లిందిరా హిడింబి! అమ్మో రవీంద్రకి తెలిస్తే ఏమంటాడో? అలా కొత్తవాళ్లని లోపలికి రానివ్వకూడదు అంటాడేమో? అయినా చూస్తూ చూస్తూ మనిషి ముఖంమీదే ఎలా తలుపు వేసేయడం?''

ఆ రాత్రి రవీంద్రకి మధ్యాహ్నం జరిగిన సంగతంతా చెప్పింది. రవీంద్ర తేలిగ్గా కొట్టి పారేసాడు ఆమె భయాన్ని.

''చూడూ! వాళ్లూ మనుషులే. ఊరికే ప్రతివాళ్లనీ చూసి భయపడకు. సోషల్‌గా వుండడం నేర్చుకోవాలి''

రోజులు గడుస్తున్నాయి. సిల్వియా అప్పుడప్పుడు వస్తూపోతూ వుంది. ఒకసారి తమ ఫ్లాట్‌కి ఆహ్వానించింది తన్మయిని. తన్మయి వెళ్లింది. కాసేపు మాటలయ్యాక సిల్వియా తను తయారుచేసిన వంటకాన్ని రుచి చూడమని ప్లేట్లో పెట్టి తెచ్చింది. తన్మయికి అదేంటో అర్థంకాలేదు. కష్టపడి నాలుగు స్పూన్లు నోట్లోకి పంపించింది. కొద్దిసేపట్లోనే కడుపులో తిప్పినట్టయింది. తలంతా తిరుగుతున్నట్లుగా అయిపోయింది. భయమేసింది. ''ఇందులో ఏం కలిపిందో ఈ రాక్షసి!'' అనుకుంటూనే బాత్రూమ్ ఎక్కడని అడిగింది.

సిల్వియా బాత్రూం చూపించింది తన్మయిని అనుమానంగా చూస్తూ. లేచి నాలుగడుగులు వేసి భళ్లున వాంతి చేసుకుంది తన్మయి. కళ్లు తిరుగుతున్నట్టయి కిందనున్న కార్పెట్‌మీదకి వాలిపోయింది. కళ్లముందు చీకటి వలయాల్లా తిరుగుతూ కమ్ముకుంది.

★★★

తెలివొచ్చేసరికి తన్మయి సోఫాలో పడుకుని వుంది. పక్కనే ఆమె ముఖంలోకి ఆందోళనగా చూస్తూ సిల్వియా.

తన్మయికి కోపం తన్నుకొచ్చింది. ఒక్క ఉదుటున లేవబోయింది.

''నో! నో. లేవద్దు. పదహారో నెంబర్ ఫ్లాట్‌లో ఉన్న డాక్టర్‌కి కబురు పెట్టాను. వస్తుంటాడు'' సిల్వియా అంటుండగా కాలింగ్ బెల్ మోగింది. ఓ నల్ల డాక్టరు! వస్తూనే-

''ఏం ప్రాబ్లమ్ ఆంటీ?'' అడిగాడు.

సిల్వియా తన్మయిని చూపించింది. డాక్టర్ భయంగా చూస్తున్న తన్మయి నాడి పట్టుకుని చూసాడు. స్టెతస్కోప్‌తో విన్నాడు.

''కంగ్రాట్యులేషన్స్ యంగ్‌లేడీ. మీరు తల్లి కాబోతున్నారు. అయితే కొంచెం వీక్‌గా వున్నారు. కాబట్టి ఫుడ్ బాగా తీసుకోండి. రెస్టు తీసుకోండి. ఏం ప్రాబ్లెమ్ లేదు'' మందులపెట్టె చేతిలోకి తీసుకుని లేచాడు. సిల్వియా కేకపెట్టి ఆ డాక్టర్ బుగ్గమీద ముద్దు పెట్టుకుంది.

''థాంక్ యూ అలెక్స్''

''ఓకే! ఓకే'' డాక్టర్ వెళ్లిపోయాడు.

తన్మయికి ఆ మాటలేవీ ముందు అర్థంకాలేదు. అంతా హఠాత్తుగ జరిగిపోయింది. డాక్టర్‌ని పంపేసి పరుగులాంటి నడకతో లోపలికొచ్చింది సిల్వియా.

''అర్థమయిందా? పిచ్చిపిల్లా, నువ్వు అమ్మవు కాబోతున్నావు. గాడ్ బ్లెస్ యూ'' దగ్గరకొచ్చి తన్మయి రెండు బుగ్గలూ ముద్దు పెట్టుకుంది. పక్కనే కూర్చుని తన్మయిని దగ్గరకు తీసుకుంది. తన్మయికి తెలియకుండా విచిత్రంగా ఆమె చేతులు సిల్వియా మెడ చుట్టూ పెనవేసుకున్నాయి. నోట్లోంచి మాట రాలేదు.

సిల్వియా తన్మయి వీపు నిమురుతూ మంద్రంగా అంటోంది-

''నాకు తెలుసు నీ మనసిప్పుడు ఎలా వుంటుందో. మరేం భయంలేదు. భగవంతుడు నిన్ను దీవించాడు. సాయంత్రం రవీంద్ర రాగానే అతనితో చెప్పు. ఈ ఆనందాన్ని హాయిగా మీరిద్దరూ పంచుకోండి''

తర్వాత తన్మయిని ఆమె వాటాలో దిగబెట్టి వెళ్లింది సిల్వియా.

తలుపుమూసి వచ్చి కూర్చుంది తన్మయి.

''అమ్మ కాబోతున్నావు! తల్లి కాబోతున్నావు'' అంటే? తన్మయి బుగ్గలు ఎర్రబడ్డాయి. నెమ్మదిగా చేతులతో పొట్ట తడుముకుంది.

ఆనందమో! ఆశ్చర్యమో! ఆందోళనో!

కళ్లలో నీళ్లు నిండాయి. తల్లి అచ్చమాంబ గుర్తుకొచ్చింది.

''అమ్మా! నేనూ అమ్మను కాబోతున్నానమ్మా'' తన్మయి ఏడ్చేసింది. వెళ్లిపోయాలి. ఇండియా వెళ్లిపోవాలి. అమ్మ దగ్గరికి వెళ్లి అమ్మను కౌగలించుకుని కరువుతీరా ఆనందంతో ఏడవాలి.

ఎంతసేపయిందో తెలీదు. కాలింగ్‌బెల్ మోగింది. రవీంద్ర వచ్చాడు. సంగతి తెలిసి-

''యాహూ! అమెరికా నాకు ఇచ్చిన మూడో బహుమతి! థాంక్యూ అమెరికా'' కళ్లు అరమోడ్పులు చేస్తూ అంటున్నాడు.

తన్మయికి మళ్లీ మనసులో ఎక్కడో కలుక్కుమంది.

రవీంద్ర వెంటనే ఇండియాకి ఫోను చేసాడు. ఎక్స్‌టెన్షన్ ఫోన్లో తన్మయి కూడా వింటోంది.

''అత్తయ్యా! గుడ్ న్యూస్! మీరు అమ్మమ్మ కాబోతున్నారు''

అట్నుంచి అచ్చమాంబ-


''ఆ! నిజంగానా! పొద్దునే ఎంత చల్లటి కబురు చెప్పావు నాయనా. ఏమండీ విన్నారా? అమ్మాయి నీళ్లోసుకుందట'' వింటున్న తన్మయికి అన్పించింది.

'ఎంత బావుందా మాట?' ఇదే ఒకప్పుడయితే తన్మయి విసుక్కుంటూ వుండేది.

''ఏంటమ్మా! అలా సిల్లీగా మాట్లాడతావు. డీసెంట్‌గా మాట్లాడడం ఎప్పుడు నేర్చుకుంటావు?'' అని. కానీ ఇప్పుడు ఇన్నాళ్ల తరువాత ఆ ఒక్క మాట! ఆ భావంలోని సహజత్వంవల్ల చెవులకి ఎంత ఇంపుగా వినిపిస్తోంది. 'తన', 'మన'కి తేడా ఏమిటో తన్మయికి స్పష్టంగా తెలిసింది.

అచ్చమాంబ అంటోంది. ''ఏది బాబూ! దానితో ఒక్కసారి మాట్లాడించు''

''హలో అమ్మా... నేను కూడా వింటున్నాను. చెప్పమ్మా'' మాటలు సులభంగా రావడంలేదు.




**కథల పోటీ మానవ సంబంధాలు విభాగంలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథా రచయిత నడిమింటి జగ్గారావు.**

వయసు-37 సం, చదువు-బికాం, బిఎల్, స్వస్థలం-విశాఖపట్నం, ఉద్యోగం-సీనియర్ అకౌంటెంట్, ఏజీ ఆఫీసు, హైదరాబాద్, హాబీలు-పుస్తకాలు చదవడం, అప్పుడప్పుడు కథలూ, కవితలూ వ్రాయడం, నాటకాల్లో నటించడం, దర్శకత్వం నెరపడం, ఇష్టమైన కవులు-శ్రీశ్రీ, తిలక్, సినారె, ఆరుద్ర, రచయితలు-రావిశాస్త్రి, ఓనాదేవి, తిలక్, విశ్వనాథ సత్యనారాయణ, పురాణం.

గొంతులో ఏదో అడ్డొస్తోంది.

''దొంగపిల్లా! ఎంతదానివయ్యావే! అమ్మ గుర్తొచ్చిందా అమ్మా ఇప్పుడు? ఎలా వున్నావు తల్లీ. వీలు చేసుకుని వెంటనే వచ్చేయమ్మా. ఇక్కడ నేనూ, మీ నాన్నా ఎంత బెంగ పెట్టుకున్నామో నీ గురించి. ఊరుకాని ఊర్లో నువ్వొక్కర్తివే ఏం బాధలు పడతావు చెప్పు. ఇక్కడికొచ్చేస్తే నా చేతులమీదుగా ఈ పురుడుపోసి నిన్నూ, పిల్లాడ్నీ మళ్లీ జాగ్రత్తగా దిగబెట్టేస్తానమ్మా! వచ్చేస్తావుకదూ?''



రవీంద్ర చెబుతున్నాడు.

''అత్తయ్యా! మీరేమీ బెంగపడకండి. ఇక్కడ మంచి డాక్టర్లూ, హాస్పిటళ్లూ వున్నాయి. ఇక్కడకన్నా అక్కడ ఏం జరుగుతుంది చెప్పండి?'' అచ్చమాంబ అంటోంది-

''అంత మాటనకు బాబూ. మా ప్రాణాలన్నీ అక్కడే వున్నాయి. ఈ విషయంలో నువ్వేమీ అనుకోకు. ఇండియాలో ఏమీ ఫర్వాలేదు. నిన్నూ దాన్నీ- మీ అమ్మా నేనూ ఇక్కడే ఇండియాలోనే కన్నాం నాయనా. నా మాట కాదనకు''

''సర్లెండి. ఇప్పటికే ఫోను బిల్లు చాలా అవుతుంది. మళ్లీ ఫోను చేసినప్పుడు మాట్లాడతానులెండి. మామగారికి కూడా చెప్పండి'' ఫోను పెట్టేసాడు.

తన్మయి అడిగింది ''ఏనండీ, నన్ను ఇండియా పంపించరూ?''

''అర్థం లేకుండా మాట్లాడకు. ఎందుకు ఇండియా వెళ్లడం? ఇక్కడ నీకేం తక్కువ? ఇక్కడలేని సదుపాయాలు నీకు అక్కడ ఏం వున్నాయి? హాస్పిటల్‌కు వెళ్లే క్యూలు, సమయానికి రాని డాక్టర్లు, సరైన శిక్షణలేని నర్సులు, పాతికకీ పరకీ చేయి చాచే వార్డుబోయ్‌లూ, శుభ్రత లోపించిన వార్డులూ, ఎక్కడ చూసినా లంచాలు! లంచాలు! ఎందుకు వెళ్లడం ఇండియాకి? ఏముందక్కడ?''

''అమ్మ'' తన్మయి స్థిరంగా సమాధానం చెప్పింది.

★★★

తరువాతి రోజుల్లో చాలాసార్లు ఇద్దరికీ వాదోపవాదాలు జరిగాయి. ఒక వీకెండ్‌కి మాటల సందర్భంలో సిల్వియాకి తన వాదన వినిపించాడు రవీంద్ర.

''మీరే చెప్పండి ఆంటీ! ఇప్పుడు ఈమె ఎందుకు ఇండియా వెళ్లడం? రానూపోనూ బోలెడంత ఖర్చు. అదే ఇక్కడయితే ఖర్చంతా మా కంపెనీ భరిస్తుంది. ఇదికాక సదుపాయాలు, సౌకర్యాలు ఎక్కువ. ఇంకెందుకు ఇండియా వెళ్లడం? చెప్తే వినదు. ఉత్త సెంటిమెంటల్ ఫూల్‌లా మాట్లాడుతుంది. చూడండి'' అంతా విని సిల్వియా చెప్పింది-

''బాబూ! ఇది మీ ఇద్దరికీ సమస్యే. కాదనను. కానీ ఆరుగురు పిల్లలకి తల్లిగా, పదిమంది మనవలకి అవ్వగా చెబుతున్నాను. ఈ సమయంలో తన్మయి తన తల్లి దగ్గర వుండడమే సబబు. మీ మగవాళ్లు మరో పది జన్మలెత్తినా ఒక్క ఆడదాని మనసు అర్థం చేసుకోలేరు. నా కూతుళ్లు నలుగురూ డెలివరీ టైముకి నా దగ్గరికే వచ్చారు. అమ్మాయి మనసు నేను బాగా అర్థం చేసుకోగలను. ఆమె చెప్పినట్లు చెయ్యి. నీకు జీవితాంతం గుర్తుండి వుంటుంది. ఆమె అమ్మ చేతుల్లోనే ఆమెను కూడా అమ్మను కానివ్వు''

వింటున్న తన్మయి సిల్వియా ముఖంకేసి చూసింది. 'ఇన్నాళ్లూ ఈ ముఖాన్నేనా తను ఏవగించుకున్నది? ఈ మనిషినేనా తను హిడింబి అనీ, రాక్షసి అనీ అనుకుంది.

మాతృత్వ వాత్సల్యం పొంగి పొరలుతున్న ఈ ముఖం ఇప్పుడెంత అందంగా వుంది? తన్మయి కళ్లలో నీళ్లు నిండాయి. నీళ్లు నిండిన కళ్లకి సిల్వియా అచ్చు తన తల్లి అచ్చమాంబలా కనిపిస్తోంది. ఎల్లలులేని మాతృత్వంయొక్క విశ్వజనీనత కళ్లముందు స్పష్టంగా సాక్షాత్కరించింది.

రవీంద్ర ఆమెనే చూస్తున్నాడు.

సిల్వియా తన్మయిని దగ్గరకు తీసుకుని నెమ్మదిగా తనలో తను మాట్లాడుకుంటున్నట్లుగా అంటోంది.

''చూడు తన్మయి. ఒకవేళ నువ్వు ఇండియా వెళ్లలేకపోయినా నీకేమీ ఫర్వా లేదు. నేను వున్నానుకదా. ఈ చేతిమీదుగా ఎనిమిదిమంది పుట్టారు. నీకేం భయం లేదు. మీ అమ్మ ఎంతో నేనూ అంతే అను కో. ఇన్నాళ్లూ నాకు నలుగురు కూతుళ్లు. ఈ రోజునుంచి అయిదుగురు. సరేనా?''

తన్మయి ఇక తట్టుకోలేకపోయింది, సిల్వియా ఆప్యాయతకి. గుండె గొంతులోకి వచ్చింది. నిశ్శబ్దంగా రవీంద్రవైపు చూసింది. ఆమె చూపుల్లో లక్ష ప్రశ్నార్థకాలు, కోటి భావాలు.

సిల్వియా కూడా రవీంద్రవ వైపు చూసింది.

ఇద్దరూ తనవైపే చూస్తుండడంతో

తనెక్కడ తనవైపు చూస్తున్నారో, తనలోకి చూస్తున్నారో, తనెక్కడ్నించి వచ్చాడో, ఎలా వచ్చాడో గమనిస్తున్నారో అనిపించి ఆ నిశితమైన చూపుల తాకిడికి చలించిపోయాడు రవీంద్ర.

ఇద్దరిదీ ఒకటే హృదయం.

హృదయం కాదు మాతృక!

తన కంప్యూటర్ భాషలో **The Same Matrix.**

తన్మయి సిల్వియాలో తన తల్లిని చూసుకుంటున్నట్లు ఆమె గుండెల్లో ముఖం దాచుకుని కళ్లు మూసుకుంది.

చూస్తున్న రవీంద్ర కళ్లు రెండు కన్నీటి బొట్లను ప్రసవించాయి.

అంతే!

తనీ లోకంలోకి వచ్చి కేరేమున్నట్లు ఉలిక్కిపడి ఫోను అందుకున్నాడు.

తన ట్రావెల్ ఏజెంట్‌కి రింగ్ చేసి-

''ఇండియాకి రెండు టిక్కెట్లు..మిస్టర్ అండ్ మిసెస్ రవీంద్ర. సాధ్యమైనంత తొందర్లో కావాలి. థాంక్యూ!''

వింటున్న సిల్వియా, తన్మయిల ముఖాల్లో వెలుగు!

రవీంద్ర కళ్లల్లో తనను తాను గెలిచిన తేజస్సు!

★

## హీరో హిందుస్తానీ



**ఇటీవల హిందీలో సూపర్ హిట్టయిన చిత్రాల్లో ప్రముఖంగా రెంటిని చెప్పుకోవాలి. ఒకటి రాజా హిందుస్తానీ, మరొకటి హీరో నంబర్ వన్. ఈ రెండు టైటిల్స్‌లో మాటల్ని తీసుకుని ఇప్పుడు మరో చిత్రం తయారు కాబోతోంది. యువ కథానాయకుడు అర్షద్ వార్సి హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి 'హీరో హిందుస్తానీ' అనే పేరు పెట్టారు దర్శక నిర్మాతలు. ఆ సినిమాలు ఆడినట్టుగా ఈ సినిమా కూడా హిట్టయిపోవాలనేది నిర్మాత తాపత్రయంతం కాబోలు. హిట్ కావడానికి టైటిల్ ఒక్కటే చాలదుగా. సినిమాలో సరుకుండాలి!**

**-జె.ఎం.**